

✷ స్టెతస్కోపు టేబిల్‌మీద పెట్టి కుర్చీలో కూర్చుంటూ 'ఒక్కసారి మీ వారిని తీసుకు రావాల్సింది' అన్నాడు మాధవరావు.

'వారు రారండీ. ఎంతో చెప్పాను' అంది మాలతి డాక్టర్‌వైపు చూడలేక.

'ఏం? ఏం చేత?' ఆశ్చర్యపోయాడు మాధవరావు.

'వారికి డాక్టర్లన్నా మందులన్నా ఇష్టం వుండదు.'

'ఐసీ, తమాషాగా వుందే! పెళ్ళయి ఎన్నేళ్ళయింది?'

'నాలుగేళ్ళు.'

'పెళ్ళికి ముందునుంచేనా?'

తలవంచుకునివున్న మాలతి కళ్ళు విచ్చ బడ్డాయి. తలెత్తలేక, అయిష్టంగానే 'అవును' అంది సమాధానం చెప్పాలన్నట్టుగా.

'మీకెవరికీ తెలీదా?'

డాక్టర్ ప్రశ్నలొక్కొక్కటీ ఈటెల్లా హృదయానికి తగిలి రక్తాన్ని చిందిస్తున్నాయి. చీరకొంగుతో కళ్ళొత్తుకుని, ఎగసెగసిపడుతున్న వుద్వేగాన్ని అపుకోవడానికి విఫలప్రయత్నం చేసింది. ఆమె పరిస్థితి అర్థంచేసుకున్న మాధవరావు బాధపడ్డాడు అనవసరంగా గాయాన్ని కెలికానేమో ఏమ కుంటూ.

'మిసెస్ మాలతీ! అయాం వెరీసారీ! మీ మనసు నొచ్చుకునే విషయాలు అడిగాను' అన్నాడు సానుభూతి ధ్వనిస్తున్న స్వరంతో.

'ఫర్వాలేదు డాక్టర్. అది మీ వృత్తి ధర్మం' అంటూ తలెత్తి మొదటిసారిగా మాధవరావు వైపు చూసింది. వర్షించడానికి సిద్ధంగావున్న మేఘాల్లా వున్నాయి ఎరుపెక్కిన మాలతి నేత్రాలు. కొన్ని వందలమంది రోగులకు గుండెధైర్యం చెప్పిన మాధవరావుకు ఆ క్షణంలో పిరికితనం వెన్నుపూసలో కదిలినట్టనిపించింది. అతని హృదయం కరుణతో చెమ్మగిలింది.

'మీకు ఎలా ధైర్యంచెప్పాలో నాకు తెలియడం లేదు. ఇంత చిన్నవయసులో రగులుతున్న అగ్నిపర్వతాలను మీ గుండెల్లో, ఎలా చిరునవ్వుతో మోస్తున్నారో నా వూహకు అందడంలేదు. మీ కెవరిమీదా కోపంలేదా?'

'కోపమా? దేనికి?' అంది మాలతి పేలవంగా, నవ్వడానికి ప్రయత్నంచేస్తూ.

'పండంటి మీ పాతికేళ్ల జీవితం పండిపోయే దశకు వచ్చినందుకు! మీ నెత్తిన నిప్పులకుంపటి పెట్టిన వాళ్లమీద! చూస్తూ చూస్తూ మిమ్మల్ని నరకంలోకి లాగిన వ్యక్తిమీద!' అన్నాడు మాధవరావు కొంచెం ఆవేశంగా. అతనంత ఆవేశంగా మాట్లాడ్డానికి కారణం లేకపోలేదు. ఏడాదిక్రితం—రూపంలో కాకపోయినా పోలికలో సరిగ్గా మాలతిలానేవుండే అతని చెల్లెలి దారుణ మరణం; నాలుగు నెలలుగా అతనికి మాలతితో వున్న చనువువల్ల ఏర్పడిన ఆత్మీయత అతన్ని అలా మాట్లాడించింది.

'మన జీవితాలిలా అవడానికి కారణం మరెవరో అనే పెసిమిజంమీద నాకు అవగింజంత నమ్మకంలేదు. మనమొక పెద్ద యాపిల్‌పళ్ళ కుప్పదగ్గరి కెళ్ళామనుకోండి. ఎవరికి దొరికిన యాపిల్ వాళ్ళు తీసుకుంటున్నారు. మనకు దొరికిన యాపిల్ మన ప్రక్కవాడి దానికంటే చిన్నదనో, వాడిపోయిందనో అని అనుకుంటే మన కసలు తృప్తి వుండదు. మనకు ప్రాప్తమున్నదింతేనని సరిపెట్టుకుని, ఆ వున్నదానిలోంచే ఆనందాన్ని పుట్టించుకోవాలి' అంది మాలతి, కళ్ళలో సుడులు తిరుగుతున్న కన్నీళ్లతో.

'అలాంటివాళ్ళు నిజంగా సంతోషించలేక, సంతోషంగా వున్నామని యితరులు అనుకోవాలని సంతోషిస్తున్నట్టు నటిస్తూ వుండి వుండొచ్చుగా?

సజీవ్ గారి వేయడానికి తగిన పదం దొరకని వ్యక్తిలా ఫలిక్కిపడ్డట్టు మాధవరావును చూసింది. ఏం చెప్పాలో తెలియనంత కంగారుపడింది. కదులుతున్న పెదాల మధ్య మాటలు నలిగి బయటికి రాలేకపోయాయి.

'గుండెలమీద చెయ్యివేసుకుని, మీ అన్నయ్యతో మాట్లాడుతున్నా ననుకుని నాకో ప్రశ్నకు సమాధానం చెప్తారా?'

భూమి కంపించినట్టు మాలతి నిలువెల్లా కంపించింది. డాక్టర్ అడగబోయే ప్రశ్న కళ్ళముందు కదిలినట్టు అనిపించింది.

'అడగండి' బరువెక్కుతున్న గుండెల్లో మంటల్ని చల్లార్చుకోవాలన్నట్టు అంది,

'నిజంగా మీ వారిమీద మీకు కోపం లేదా ?'

'దేనికి?'

'మీకే తెలియాలి ! నాక్కావాల్సింది జవాబు, ప్రశ్నకాదు'

'మళ్ళీ ఎప్పుడు రమ్మంటారు ?' వానిటీబాగ్ గట్టిగా రెండు చేతులతో వలుపుతూ లేచింది.

'మీ యిష్టం. సమాధానం చెప్పనే లేదు.'

'త్వరలో చెప్తాను. నేను వెడతాను డాక్టర్'

'మీ వారిని ఎలాగైనా ఒకసారి నా దగ్గరికి తీసుకురండి. రమ్మంటే నేను మీ యింటికి వస్తాను.'

'ఆ సంగతి ఆలోచించి చెప్తాను'

'మంచిది ఆఫీసుకా?'

'ఏది తప్పినా అదిమాత్రం తప్పదుగా. వస్తానండీ' అంది తనకు మనశ్శాంతి దొరికేది ఆఫీసులోనే ననుకుంటూ మెట్లుదిగి వెడుతున్న మాలతిని చూస్తున్న మాధవరావు అనుకున్నాడు— ఇలాంటి అమ్మాయిలు ఈ కాలంలోకూడా యింకా అక్కడక్కడ వున్నారు.

* * *

మాధవరావు ఆస్పత్రినుండి, నేరుగా మాలతి ఆఫీసుకు వెళ్ళింది. మెజనైన్ ఫ్లోర్లోవున్న టాయిలెట్ రూంలోకివెళ్ళింది. అద్దంలో మొహం చూసుకుంది. వుబ్బినట్టున్నాయి కళ్ళు, కనురెప్పలక్రింద నల్లటి చారలు, దవడ ఎముకలు కనిపిస్తున్నాయి. అలసిపోయినట్టుగా వుంది. పెళ్ళికిముందు తనలోవుండే చలాకీతనం, కళాకాంతులు ఏమయ్యాయి? పెళ్ళితో మాయ మయ్యాయా? డాక్టర్ మాటలు జ్ఞాపకం వచ్చాయి. తనకు ఆయనమీద కోపమా? కట్టలుతెంచుకున్న సముద్రపు వుప్పెనలా వచ్చిన దుఃఖాన్ని ఆపుకోలేక రెండు చేతులతో మొహం కప్పుకుని వలవల ఏడ్చింది. ఎవరో వస్తున్నట్టు అడుగుల చప్పుడవడంతో దబదబ మొహం కడుక్కుని బ్యాగ్లోంచి రెండు టాబ్లెట్స్తీసి మింగింది. ఈ టాబ్లెట్స్ వల్లనే తను యింకా బ్రతకగలుగుతోందేమో ననిపిస్తుంది అప్పుడప్పుడు.

'మీరిక్కడున్నారా?' అంటూ తలుపు తెరుచుకుని వచ్చింది లలిత.

'ఇప్పుడే వచ్చానండీ' అంటూ నవ్వింది మాలతి.

'భలేవారే! అవతల మన యమధర్మరాజు ఫైరింజన్లా గొడవచేస్తున్నాడు. పదండి.'

కూనిరాగం తీస్తూ లలిత చేత్తో తల వెంట్రుకలు సగిచేసుకుని, చెరిగిన బొట్టు దిద్దుకుంది.

మాలతి ఆ ఆఫీసులోచేరి రెండేళ్ళయింది. తన పని తను చూసుకుని మిగతా సమయాలలో తలవొంచుకుపోయే రకం మనిషవడంవల్ల ఆమె అంటే ఆఫీసులో అందరికీ మంచి అభిమానం, గౌరవం వున్నాయి. మాలతితో చాలా చనువుగా వుండేది లలిత, జానకి.

మిగతా వాళ్ళకు దూరంగా వుండాలని మాలతి ఎప్పుడూ అనుకోకపోయినా, వాళ్ళు మాలతితో అంత స్నేహంగా వుండలేకపోయారు. బహుశా మాలతి గంభీరత వాళ్ళను ఆమెకు దగ్గరగా రానివ్వకపోయి వుండొచ్చు.

లేడీస్రూంలో ఆఫీసులోవుండే అమ్మాయిల జనాభా అంతా జమ అవుతారు లంచ్ టైంలో. సినిమాలు, చీరెలు, సీరియల్సు, జోక్సు, కూనిరాగాలు మొదలయినవన్నీ ప్రతి నిత్యం వుంటాయి వాళ్ళ కార్యక్రమంలో.

— 'లలితా మీకొక సంగతి చెప్పడమే మర్చిపోయాను' అంది మాలతి నవ్వుతూ.

'ఇప్పుడు జ్ఞాపకం వచ్చినందుకు సంతోషం' అంది లలిత.

'ఎల్లుండి మా బాబు పుట్టినరోజు పండుగ చేసుకుంటున్నాం. మీరిద్దరూ మా యింటికి రండి.'

'అవశ్యం. అన్నట్టు యినాళన్నా ఆ ఫోటోలు తెచ్చావా?' అడిగింది జానకి.

'తీసుకు రాకపోతే నన్ను చీల్చి చెండాడతావని తెలుసు కాబట్టి. రాత్రి తీసి బ్యాగ్లో పడేశాను ఇదిగో చూడండి' అంటూ బ్యాగ్లోంచి పెద్ద కవరు తీసి వాళ్ళకిచ్చింది. దాదాపు ముప్పై ఫోటో లున్నాయి. ఒక్కొటొక్కటే చూస్తున్నారు శ్రద్ధగా.

'మీ ఆయనేమిటి యింత సన్నగా వున్నారు?' అంది లలిత.

'సరిగ్గా తిండిపెట్టదేమో? చెప్పినమాట వినడేమో!' అంది జానకి చిలిపిగా.

జానకి మాటలకు లలిత, మాలతి నవ్వుకున్నారు.

గేట్వే ఆఫ్ ఇండియా, మెరీన్డ్రైవ్, జూహూబీచ్, జహంగీర్ ఆర్ట్ గ్యాలరీ, మలబార్ హిల్స్, చౌపాతీ, ఫ్లవరాఫ్ఫౌంటెన్ మొదలయినచోట్ల తాము తీయించుకున్న ఫోటోలగురించి, వాళ్ళ బాబు ఎంత అల్లరి చేసింది వివరంగా చెప్పింది మాలతి.

'ఫర్వాలేదు. మీవారికి కెమెరా పిచ్చివున్నదన్నమాట. నిన్నూ, బాబును చాలా చక్కగా తీశారు. నీకంటే నీ ఫోటో వెయ్యిరెట్లు అందంగా వుంది. ఏదో కాస్త రెకమెండ్ చేయించి మాఫోటోకూడా తీయించి పెట్టు. మీవారు తీస్తే కొంచెం బాగా కనిపిస్తామేమో!' అంది లలిత.

'అవునవును ఈవిడగారిని చూసి ఎవరూ చేసుకోవడం లేదు, కనీసం మీవారు తీసిన ఫోటోను చూసయినా ఎవరన్నా ముందుకొస్తారేమోనని ఆశ' అంది జానకి కొంటెగా.

'ఫోనోయ్' అంది లలిత గుర్రుగా.

ఇతరుల్ని ఏడ్పించడమంటే జానకికి చాలా సరదా. ఆవిద్య ఆమెకు వెన్నెతో పెట్టకుండానే వచ్చింది. వాళ్ళిద్దరి సమక్షంలో ఎంతో వుషారుగావుండే మాలతి, తన సీటుకి చాలా పరధ్యానంగా వుంటుంది. వలవిసిరినట్టు మనసులో ఆలోచనలు పరుచుకుంటాయి. ఆఫీసులోచేరిన కొత్తలో లలిత

నంగాతే అడిగింది.

'మీరెందుకలా పరాకుగా, ఏదో పోగొట్టుకున్నట్టు వుంటారు?'

'అబ్బే ఏమీలేదండీ. రాత్రి సరిగా నిద్ర పట్టకపోవడంవల్ల కొంచెం బడలికగా వుంది' అంది మాలతి పెదాలమీద చిరునవ్వు అతికించుకుని.

'మీకేదయినా విచారం ఉంటే అందులో కొంచెం మాకు యివ్వండి, పంచుకొంటాం. మీ రెప్పుడూ ఏదో అర్థం కాని సమస్యను గురించి ఆలోచిస్తున్నట్టు కనిపిస్తుంటారు' అని జానకికూడా అంది.

'అలాంటి దేమీ లేదండీ. పనిలేక అలా ఉంటాను' అంది మాలతి, వాళ్ళను మభ్యపెడుతున్నావ్ సుమా అని అంతరాత్మ ఆక్రోశిస్తున్నా.

వాళ్ళిద్దరు మళ్ళా ఆ విషయం ఎత్తలేదు. మాలతి తన స్వంత గొడవ లెప్పుడూ వాళ్ళకి చెప్పలేదు. వాళ్ళు అడగలేదు; అడగాల్సిన అవసరమెప్పుడూ కలగలేదు కాబట్టి.

మల్లేపల్లి మెలికల మూల ఉన్న మాలతి ఇల్లు కనుక్కోడానికి వాళ్ళకి యించుమించు చిక్కు దారాల్ని సరిచేసినంత కష్టమైంది. బాబుకోసం కొన్న ప్రెజెంటు తీసుకొని రిక్షాకు డబ్బులిచ్చారు.

'ఇల్లు కనుక్కోగలరో లేదోనని భయపడుతున్నాను. జాగ్రత్తగా ఆ మెట్లు ఎక్కి పైకి రండి.'

'నీకా భయం అవసరం లేదు. రాజధాని నగరంలో ఇలాంటి వీధులు కూడా వున్నాయని అనుభవపూర్వకంగా తెలుసుకోవడానికి నువ్వూ, మీ బాబు మాకు యిచ్చిన ఈ మహత్తర అవకాశానికి ఇవే మా కృతజ్ఞతలు' అంది జానకి సగం వంగి కుడిచెయ్యి పొట్టదగ్గర పెట్టుకుని.

'మీవారింకా విచ్చేయలేదా?' అంది లలిత ఆ యింటివి అన్ని కోణాల్నించి చూస్తూ.

'ఫ్యాక్టరీలో పనెక్కువగా వుందట. పర్మిషన్ తీసుకొని వస్తానన్నారు. ఈపాటికి రావాల్సిందే' అని మాలతి చెపుతుండగా ప్రకాశం వచ్చాడు.

మాలతి పరిచయం చేసి 'మాట్లాడుతూ వుండండి. ఇప్పుడే వస్తాను' అంటూ వంటింట్లోకి వెళ్ళింది. ముగ్గు రే మిగిలారు కుర్చీల్లో. వాళ్ళకంటే ప్రకాశం మరీ బిడియస్తుడు కావడంవల్ల సంభాషణ కష్టం వేసిన గుర్రంలా బిగుసుకుపోయింది.

'బాబు నిద్ర పోతున్నట్టుంది.' నిశ్శబ్దాన్ని చీల్చింది జానకి.

'ఊఁ' అన్నాడు ప్రకాశం.

ప్రకాశం సన్నగా, ఉఫ్‌మంటే కదిలేట్టు వున్నాడు. ఉక్కపోస్తుంటే, గొంగళిలాంటి ఆ బ్లేజర్‌కోటు, ఉలెన్ మఫ్లర్ ఎందుకు వేసుకున్నాడో వాళ్ళకి అర్థం కాక ఫ్యాషన్ కాబోలనుకొన్నారు.

'ఏ కంపెనీలోనండీ మీరు పని చేసేది?' ఈసారి లలిత వంతయింది.

'సనత్‌నగర్‌లో వో స్టార్చ్ ఫ్యాక్టరీ ఉంది. అందులో.'

'మీరు ఎమ్మే అటగా, మాలతి చెప్పింది. ఐ. ఏ. ఎస్. ట్రై చేయాల్సింది.'

'పిహెచ్‌డీ చేస్తున్న రోజుల్లో ఆ అయిడియా వచ్చింది. ఎక్కడెక్కడో తిరగాల్సి ఉంటుందని అమ్మగారు వద్దంటే ఆ ప్రయత్నం మానుకొన్నాను.'

ఫోల్డింగ్ టేబిల్‌మీద, ఫోటో స్టాండ్‌లో క్యాబినెట్ సైజు ఫోటో కనిపించింది వాళ్ళకి. ఆ ఫోటో పెట్టిన తీరు చూస్తే, ప్రకాశం తల్లికి ఎంత ప్రాముఖ్యత ఇస్తాడో తేలిగ్గా తెలిసిపోతుంది.

'మీ అమ్మగారు యింట్లో లేనట్టుందే?' ఆ మూడు గదుల యింటిని పరిశీలిస్తూ, ప్రకాశం జీతం ఎంత ఉండివుంటుందో అంచనా వేయసాగింది జానకి.

'మా సిస్టర్ ఢిల్లీలో ఉంది. మొన్నీ మధ్యనే వాళ్ళదగ్గరి కెళ్ళారు.'

మూడు ప్లేట్ల విజిటబుల్ పులావ్ ట్రేలో పెట్టుకుని వచ్చింది మాలతి. ప్లేట్లు ముగ్గురికీ యిచ్చి నీళ్ళు తీసుకు రావడానికి వెళ్ళింది.

చేతిలో వున్న ప్లేట్లో చెంచా కదుపుతూ 'నువ్వు కూడా వచ్చి కూర్చోకూడదూ?' అన్నాడు ప్రకాశం. మాలతి బాగా అలసిపోయినట్టు కనిపిస్తోంది. హృదయం తలంటిపోసుకుందేమో నల్లటి కురులు చెంపలమీదికి ప్రాకాలని చూస్తున్నాయి.

'ఫర్వాలేదు, మీరు కానివ్వండి' అంది మాలతి.

'ఇదండీ వరస. మన మాట వినిపించుకోదు. రాత్రంతా జ్వరంతో బాధపడింది. చీకటితో లేచి, చన్నీళ్ళ స్నానం చేసింది. ప్రతి శుక్రవారం కాళ్ళకు పసుపు రాసుకుని తల స్నానం చేస్తుంది. ఆరోగ్యం సరిలేనప్పుడు అవన్నీ ఎందుకు చెప్పండి. తన మతమే తనదంటుంది. ఇవాళ మీరొస్తున్నారని ఏవేవో అయిటమ్స్ చెయ్యాలంది. ఒక్కదానికి కష్టంగా వుంటుంది పని పిల్లను సాయంగా వుంచుకో అని చెప్పాను. తన చేతులమీదుగా చేసి మీకు పెట్టాలని ఈవిడ పట్టుదల. బాబుతో ప్రొద్దస్తమానం సతమతమవుతూ ఈ వంటొకటి పైగా' అన్నాడు ప్రకాశం నిష్ఠూరత ధ్వనిస్తున్న స్వరంతో. భార్యంటే అతనికి వున్న అనురాగం తొంగి చూస్తోంది అతని ప్రతి మాటలో.

'వూరుకోండి మీరు మరీనూ' అంటూ వంటింట్లోకి వెడుతున్న మాలతి మాటల్లో ఏదో అస్పష్టమైన కృత్రిమత్వం తొంగి చూసింది. ఇదమిద్ధమని జానకి నిర్ణయించుకోలేకపోయింది.

మైసూర్‌పాక్, కాఫీ కప్పులతో వచ్చిన మాలతిని చూసి లలిత అంది 'నువ్వింత ఆర్భాటం చేస్తావని తెలిస్తే మేము అసలు వచ్చేవాళ్ళం కాదు. నీకెందుకింత శ్రమ.'

మాలతి నవ్వింది. అలసటను కప్పిపుచ్చుకోవాలని తెచ్చిపెట్టుకున్నట్టుగా వుంది లలితకు ఆ నవ్వు. లలిత ప్రక్కనే కూర్చుంది మాలతి. ఒకసారి దీర్ఘంగా ఆయాసపడుతున్నట్టు శ్వాస విడిచి కఫ్ లింక్స్ విప్పుకుంటూ ప్రకాశం లేచి ప్రక్క గదిలోకి వెళ్ళాడు.

'మీ బాబేడీ?'

వుయ్యాలలో పడుకుని నిద్రపోతున్న బాబును తీసుకుని వచ్చింది మాలతి.

'అచ్చు నీ పోలికే' అంటూ లలిత బాబు బుగ్గలు నిమిరింది.

అంతవరకు నిద్రపోతున్న బాబు కళ్ళు తెరిచి నవ్వసాగాడు.

పాలబుగ్గలు, పచ్చటిరంగు, బొద్దుగా, అందంగా, ఎత్తుకోవాలనిపించేట్టు వున్న బాబును చూసి చేతులు చాపింది జానకి. పదినిమిషాలు బాబుతో కాలక్షేపం చేశాక—

'వీడికోసం తెచ్చాం. ఏదమ్మా చెయ్యి చాపు. తీసుకో' అంటూ జానకి తాము తెచ్చిన ప్యాకెట్ వాడి చిట్టి చిట్టి చేతు

కు అందించినట్టు చేసింది నవ్వుతూ.

'ఇహ మేం వస్తాం' అంటూ యిద్దరూ లేచారు.

ముగ్గురూ మెట్లవద్ద కొచ్చేసరికి, ప్రక్కగదిలోంచి విపరీతమయిన దగ్గుల శబ్దానికి జతగా ఏదో వస్తువు క్రిందపడిన శబ్దమయింది. అలానే నిలబడిపోయింది మాలతి కొయ్యబారిపోయినట్టు. మొహంలో ఆందోళన కొట్టవచ్చినట్టు కనిపిస్తోంది. ఏదో నేరం చేసినదానిలా వాళ్ళ వైపు చూసింది. వాళ్ళిద్దరికీ అర్థంకానట్టు ఒకరి నొకరు చూసుకుంటుండగా 'ఇప్పుడే వస్తాను' అంటూ మాలతి కంగారుగా పెద్ద పెద్ద అంగలేసుకుంటూ ఆ గదిలోకి వెళ్ళింది.

మాలతి వెంట తామూ వెళ్ళడమా మానడమా అని వాళ్ళు అనుకుంటుండగా—

'...నాకేం ఫర్వాలేదు ... నువ్వెళ్ళు... వాళ్ళేమనుకుంటారు?' అస్పష్టంగా గుస గుస లాంటి ప్రకాశం కంఠం వినిపించింది. మరో నిమిషం తర్వాత మాలతి వచ్చింది.

'ఏదో సూట్‌కేస్ పడిపోయింది' అంది తనే. అది అబద్ధమని ఆమె మాటల్లో వున్న అసందర్భత్వం చూపుతోంది. అనుమానాలు అల్లుకుంటున్న మనసులతో ఏవేవో పిచ్చిగీతల్లా వంకర్లు తిరిగిపోతున్న ఆలోచనలతో వాళ్ళు మెట్లుదిగుతూ 'మేం వస్తాం. నువ్వు వుండిపో' అన్నారు.

రిక్షా ఎక్కబోతూ జానకి ఒకసారి మేడమీదికి చూసింది. బాల్కనీలో నిలబడి కళ్ళు తుడుచుకుంటున్న మాలతి గబుక్కున అక్కణ్ణుంచి తప్పుకుంది, తనను జానకి చూసిందేమోననుకుంటూ.

* * *

మర్నాడు ఆఫీసులో. నిన్నటి సంఘటన గురించి అడుగుదామనుకుంది జానకి. మాలతి కావాలని ఏదో దాస్తుందా? తనడిగితే చెప్పుతుందా? ఏదో వుండివుంటుందని తను భ్రమపడుతుందేమో? తెలుసుకుంటే? స్నేహితురాలిగా తన కర్తవ్యం తను నెరవేర్చాలి. పదకొండున్నరయినా ఆ రోజు మాలతి ఆఫీసుకురా లేదు. లీవ్ పెట్టిందని లంచ్ టైంలో తెలిసింది. ఇంత హఠాత్తుగా సెలవెందుకు పెట్టినట్టు? నిన్న జరిగినదానికి ఈ లీవ్‌కు ఏదయినా సంబంధం వుందా? ఆ విషయం రేపు అడిగితే? ఏమనుకుంటుందో?—మరుసటిరోజు మాలతి ఆఫీసుకు వచ్చింది. కానీ, మాలతి మొహం చూశాక అడగడానికి తటపటాయించింది జానకి. రాత్రంతా నిద్రలేనట్టు కళ్ళు ఎర్రగావున్నాయి.

'నీ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన వివరాలు నేనెప్పుడూ అడగలేదు. ఇవాళ ధైర్యం చేసి అడుగుదామనుకుంటున్నాను నువ్వేమీ అనుకోనంటే' అంది జానకి.

క్రింది పెదవిని మునిపంటితో నొక్కిపట్టి 'ఏమీ అనుకోను' అన్నట్టు తల వూపింది.

'నిజం చెప్పు మాలా! నువ్వేదో దాచిపెడుతున్నావు. మానసిక సంక్షోభాన్ని కప్పిపుచ్చుకుని మా ముందు చిరునవ్వుతో వుంటావు. నిన్నింతగా కలవరపెడుతున్న ఆ బాధ ఏమిటో మాకు చెప్పు. ప్లీజ్.'

'అరె! ఏమిటి నీ వెర్రి ప్రశ్నలు. ఈ దిన్నగావుండి రాత్రి అసలు నిద్రపట్టలేదు. బహుశా అందువల్ల అలా కనిపిస్తున్నానేమో!'

'మభ్యపెట్టాలని చూస్తున్నావు గదూ?'

'నామాటమీద నీకు నమ్మకం లేదన్నమాట?'

'నమ్మమంటావా?'

'వొట్టు' అంటూ నవ్వింది మాలతి.

వొట్టుమీద జానకికి గట్టి నమ్మకం వుండడంవల్ల, విశ్వాసం, గూడుకట్టుకున్న కళ్ళతో నిజాన్ని ప్రోత్తి పలికినట్టుగా చెప్పిన మాలతి మాటలు నమ్మడంవల్ల జానకి ఆ విషయం మరెప్పుడూ ఎత్తలేదు. ఇంచుమించు మరిచిపోయింది.

నాలుగునెలలు గడిచిపోయాయి వొడి దుడుకులు లేకుండా.

ఆరోజు మాలతి ఆఫీసుకురాలేదు.

రెండోరోజు వచ్చింది. నీరసంగా, అలసటగా కనిపించింది.

'నిన్న రాలేదేం?' అడిగింది జానకి.

'రెండురోజుల్నుంచి మావారికి సుస్తీ చేసింది. ఇవాళకూడా లీవ్ అప్లయిచేసి పోదామనివచ్చాను. అరె! పత్రిక వచ్చినట్టుందే!' అంటూ ఆతృతగా పేజీలు తెరిచి సీరియల్ నవల పదినిమిషాల్లో పూర్తిచేసింది. తెలుగు వారపత్రికలంటే మాలతికి చాలా యిష్టం. ఆదరా బదరా ఆఫీసులోనే పైపైన పేజీలు తిప్పేంత వరకు ఆమె మనసు మనసులో వుండదు.

'డాక్టర్‌గారి దగ్గరికి కెళ్ళారా?'

'పొద్దుటే డాక్టర్ మాధవరావుగారు వచ్చి చూసిపోయారు. రేపు ఆఫీసుకువస్తాను' అంటూ లేచింది మాలతి.

మూడోరోజు—బుధవారం—మధ్యాహ్నం ఒకటిన్నర అయింది.

'మాలతమ్మగారు మీకు ఫోన్ చేశారు' అంటూ ప్యూన్ వచ్చాడు.

రాస్తున్న పెన్ మూసి లేచింది జానకి. రిసీవర్ అందుకుని 'హలో' అంది.

నిమిషంపాటు అవతలి వైపునుంచి మాలతి చెప్పిన మాటలు విన్న జానకి అవయవాలు చెమటతో ముద్దయిపోయాయి.

'సరే' అంటూ వణుకుతున్న చేతులతో రిసీవర్ క్రెడిల్‌మీద పెట్టి, తొందర తొందరగా లలిత వద్దకెళ్ళింది. ఫైల్సు సర్దుతున్న లలిత, జానకి వాలకం చూసి విస్తుపోయింది. దీర్ఘంగా నిట్టూర్చి 'మాలతి ఫోన్ చేసింది. డాక్టర్ మాధవరావు గారిని అర్జంటుగా తీసుకురమ్మంది' అంది జానకి.

'ఎందుకని? ఏం చెప్పింది?'

'ఏడుస్తూ చెప్పింది అతి కష్టంమీద. నాకు సరిగా బోధపడలేదు. మనం వెంటనే డాక్టరుగార్ని తీసుకునిపోదాం పద.'

'మరి ఆఫీసు...'

'ఆఫీసరుగారికి చెప్పి పోదాం.'

ఆఫీసరు అనుమతి తీసుకొని యిద్దరూ అక్కడికి దగ్గర్లోనే వున్న డాక్టర్ మాధవరావు ఆస్పత్రికి వెళ్ళేసరికి, అదృష్టవశాత్తు ఆయన తీరిగ్గా కూర్చుని వున్నాడు. ఒకటి రెండుసార్లు మాలతితో వచ్చి వుండడంవల్ల మాధవరావు గుర్తుపట్టి 'ఏమిటండీ చాలా కంగారుగా వున్నారు?' అన్నాడు.

'మిమ్మల్ని అర్జంటుగా వెంటబెట్టుకు రమ్మని మాలతి ఇప్పుడే ఫోన్ చేసింది. పదండి సార్' అంది జానకి.

'సరే' అంటూ మాధవరావు డిస్పెన్సరీ మూశాడు.

'టాక్సీలో వెడదాం.'

'నా సొంత కారుంది.' వెనక సీట్లో యిద్దరూ కూర్చున్నారు.

మాధవరావు కారు స్టార్ట్‌చేశాడు.

'మాలతి చాలా భయపడు తున్నట్టుందే

ప్రకాశంగారికి మీరు ట్రీట చేస్తున్నారు గదండీ?'

'డాక్టర్లు ట్రీట్ చేసే దశను ఆయన ఎప్పుడో దాటిపోయాడు.'

'అంటే...?'

'ఆయనకు పల్మనరీ ట్యూబర్ క్యులోసిస్ వుంది.'

పిడుగు పడ్డట్టు వాళ్ళిద్దరు షాక్ తిన్నారు. నమ్మలేనట్టు డాక్టర్ వైపు చూశారు.

'మీరు చెప్పేది మాలతి భర్త విషయమేనాండీ?'

'యస్. అతనే. అతనికి టీబీ—అదీ చాలా అడ్వాన్స్‌డ్ స్టేజిలో వున్నట్టు మీకు తెలియదా?' అన్నాడు మాధవరావు ఆశ్చర్యంతో.

'మా కసలు తెలియదండీ! మాలతి మా కెప్పుడూ చెప్పలేదు!' అంది జానకి ఇంకా షాక్‌నుంచి తేరుకోలేక.

'ఏడాది క్రితం భర్తను నా దగ్గరికి తీసుకొచ్చింది, చూడమని. అప్పటికే బాగా ముదిరిపోయి వుంది. అన్ని రోజులు అశ్రద్ధ చేసినందుకు కోప్పడి శానిటోరియంలో చేర్పించమన్నాను. ఉద్యోగం, పిల్లాడితో కష్టమండీ అంది. అలా అయితే అతన్నొక్కణ్ణే చేర్పించమన్నాను. మాలతిని వదిలి ఒక్క క్షణంకూడా వుండలేను, శానిటోరియంలో చేరను అన్నాడు అతను. మంచి మందులు, యింజక్షన్లు, పుష్టికరమైన ఆహారం, ఫ్రీక్వెంట్ మెడికల్ చెకప్స్ తీసుకుంటూ వుండాలని చెప్పాను. మందులు, యింజక్షన్లు అంటే అతనికి అసహ్యమట. చచ్చినా మందులు తినను అని మొండిపట్టు పట్టాడు. అతని విచిత్ర మనస్తత్వానికి నవ్వాలో ఏడ్వాలో అర్థం కాలేదు. నేను ఎంతో చెప్పాను. శానిటోరియం, మందులపట్ల తీవ్రమయిన విముఖత్వం చూపాడు. టీబీ చాలా ప్రమాదకరమయిన వ్యాధి అనీ, తొందరగా యితరులకు వ్యాపించే గుణం వుందనీ అందువల్ల కొంచెం జాగ్రత్తగా వుండాలనీ, ఆ అమ్మాయికి హెచ్చరించాను. నాలుగేళ్ళనాడే నా జీవితం నాశనమయిపోయింది డాక్టర్! నిండా మునిగిన నాకు జీవితమంటే తీపి ఏనాడో చచ్చిపోయింది అంది. ఆ అమ్మాయి పరిస్థితి నాకు చాలా బాధ కలిగించింది...' అంటూ మాధవరావు కారు ఆపాడు. చౌరాస్తాలో ట్రాఫిక్ జాం అయినట్టుంది. పోలీసులు హడావిడిగా సైకిల్‌వాళ్ళను, రిక్షా వాళ్ళను ఆపేస్తున్నారు.

మాలతి జీవితంలో యింత విషాదం దాగి వుందనీ; అది కనిపించనీయకుండా కప్పిపుచ్చుకుంటుందనీ, మాధవరావు చెప్పిన కధ విన్న వాళ్ళకు గుండెలు బిగుసుకుపోయినట్టయింది. మాలతి గుండె ధైర్యం వాళ్ళను విభ్రాంతుల్ని చేసింది. తమతో ఎంతో స్నేహంగా వుంటూ ఈ రహస్యాన్ని ఎందుకు దాచిపెట్టినట్టు? ఇతరులు చూపే సానుభూతిని స్వీకరించడం యిష్టంలేని ఆత్మాభిమానంవల్లనా? ఏమైనా సరేననే మొండి ధైర్యం చేతనా?

'అతనికి ఎంతకాలంనుంచి ఈ టీబీ వుందండీ?' అడిగింది లలిత.

'ఐదారేళ్ళనుంచి వుండి వుండాలి.'


'అంటే...పెళ్ళికి ముందునుంచేనా?'

'అవును. అలాంటి భయంకరమైన వ్యాధితో వున్న అతనితో పెళ్ళిచేసి ఆ అమ్మాయి తలిదండ్రులు ఆమె జీవితం నాశనం చేశారు' అన్నాడు డాక్టర్ కారు స్టార్ట్ చేస్తూ.

'బహుశా వాళ్ళకు తెలిసి వుండదు. చూస్తూ చూస్తూ ఏ తండ్రీ అలాంటి ఘోరం చెయ్యడు. అతని తలిదండ్రులు అసలు అతనికి పెళ్ళి చేయకుండా వుండాల్సింది' అంది జానకి.

'తమ కొడుకు పెళ్ళి జరగాలి, కోడల్ని, మనుమరాళ్ళను చూసుకుని ఆనందించాలని ప్రతి తలిదండ్రులు అనుకోవడం సహజం. కానీ చదువు, సంస్కారం వుండీ అతను మరీ అమాయకురాలి మెడలో తాళి కట్టడానికి ఎలా అంగీకరించాడో నాకు అర్థం కావడంలేదు. తనొక నిండు జీవితాన్ని అగ్నిగుండంలోకి ఈడుస్తున్నాననే ఆలోచన అతనికెందుకు తట్టలేదో?' అంది లలిత.

'మాలతి లాంటి ఆడపిల్లలు ఈ కాలంలో చాలా తక్కువమంది వుంటారు. భయంకరమైన రోగంతో వున్న భర్తతో కాపరంచేస్తూ ఒక్కనాడు కూడా ఆ అమ్మాయి తన దురదృష్టాన్ని గురించి విలపించలేదు. తన ప్రాప్తంకొద్దీ తనకు దొరికిన గరళాన్ని అమృతంగా మింగక తప్పదని ఆమె నాతో ఎన్నోసార్లు అంది. కోసం బాబు భవిష్యత్తును గుర్తు పెట్టుకుని, బాబును దూరంగా ఎవరి దగ్గరయినా వుంచమని చెప్పాను. తనకెవరూ లేరంది. నాలుగు నెలల తర్వాత మొన్న ప్రకాశాన్ని మళ్ళా నా దగ్గరికి తీసుకొచ్చింది. వూపిరితిత్తులు పూర్తిగా శిథిలమైపోయాయి. ఒకటి రెండు రోజులకంటే ఎక్కువ బ్రతకడని చెప్పాను. నైంటీనైన్ పాయింట్‌నైన్ పర్సెంట్ ఆశలు వదులుకోవాల్సిందే. మజిలీలో చివరి అడుగులు వేస్తున్న మనిషికి మందులు పనిచేయవు' అంటూ మాలతి యింటి ముందు కారు ఆపాడు.





సుమారు 80 పై. విలువగల

ఉచితం

మీరియం పైగా కోల్గేట్ డెంటల్ క్రీమ్ ట్యూబ్ కొంటే

చార్మిస్ టాల్క్

పెద్ద డబ్బాతో



[illegible]



జమ్మీవారి లివర్‌క్యూర్

పిల్లల లివర్, స్ప్లీన్ వ్యాధులకు

(ఆయుర్వేద తయారు)

జమ్మీ వారి లివర్ క్యూర్

పిల్లల లివర్ వ్యాధులకు నమ్మకమైన ఔషధము

* లివర్ దోషములను సరి చేయును.
* ప్రక్కశూల వ్యాధులపై చక్కగా పనిచేయును.
* పుష్టికరమైన ఔషధముగా పనిచేయును.
* శరీర పోషణను, ఉత్సాహాన్ని వృద్ధి చేయును.

వివరములకు వ్రాయండి:

సోల్ ఏజెన్సీ: జమ్మీ వెంకటరమణయ్య & సన్సు,
5-8-522/18A, చిక్కడపల్లి (స్వరాజ్ హోటల్ వెనుక) హైదరాబాద్-20 ఏ.పి.

ఇతర ఔషధములు: జమ్మీవారి మిల్క్ ఆఫ్ మెగ్నీషియా—
పైత్య రసాన్ని తగ్గించి, సుఖ విరేచనము కలిగించును.
కూకో — కోరింత దగ్గుకు (whooping cough)
సూక్ష్మరత్నటోన్ — ఆకలి, జీర్ణశక్తి నిచ్చే టానిక్.
ఉత్పత్తిదారులు: జమ్మీ ఫార్మస్యూటికల్ ఫ్యాక్టరీ, మద్రాసు-28.


# ఆహుతి

పెద్దక్క ముగ్గురూ పైకి వచ్చారు. చెదిరిపోతున్న ధైర్యాన్ని కూడగట్టుకుని తలెత్తి జానకి గదిలోకి చూసింది. ముందు గదిలో యిద్దరుముగ్గురు ఆడవాళ్ళు నిలబడి వున్నారు.

ప్రక్కగదిలో మంచంమీద ప్రకాశం పడుకుని వున్నాడు. గచ్చుమీద మంచం పట్టెను ఆనుకుని మాలతి కూర్చునివుంది. ఆమె మొహంలో ఎలాంటి భావాలు కన పడడంలేదు.

డాక్టర్నిచూసి లేచి 'రండిడాక్టర్. ఇప్పుడే అలా నిద్రపోయారు' అంది మాలతి.

డాక్టర్ ఒకసారి మాలతివైపు చూసి ప్రకాశం వొంటిమీద చెయ్యివేసి అంతా అయిపోయిందన్న అర్థం స్ఫురించేలా తల వూపాడు. మిన్నువిరిగి మీదపడినట్టు జానకీ, లలిత స్తంభించిపోయారు నోటమాటరాక.

'నే వస్తాను. మీరు ఆమెకు కొంచెం ధైర్యం చెప్పండి' అంటూ తలవొంచుకుని డాక్టర్ వెళ్ళిపోయాడు నిశ్శబ్దంగా.

'మాలతీ పద ఆ గదిలో కూర్చుందాం' అంటూ ప్రకాశం మృతదేహంవున్న గది లోంచి మాలతిని తీసుకొచ్చారు వాళ్ళు.

'వారు యిప్పుడే పడుకున్నారు. ఉక్క పోస్తున్నట్టుంది, ఫ్యాన్ వేస్తాను' అంది మాలతి. కళ్ళలో అరబొట్టుకూడా కన్నీరు లేకుండా, భర్త యింకా బ్రతికే వున్నాడన్న భ్రమతో మాట్లాడుతున్న మాలతి ధోరణి చూస్తుంటే జానకి గుండెలు బ్రద్దలయ్యాయి.

'మేం చూస్తాంలే. నువ్విక్కడే కూర్చో' అంది లలిత.

'ఉష్ [illegible] అరవకండి. వారు లేచి పోయారు. మీ [illegible] ఫ్యాన్ పెట్టు. నొప్పులుగా వున్నాయి కాళ్ళుపట్టు మాలా అంటే యిప్పటిదాకా కాళ్ళుపట్టి పాదాలకు ఆలివ్ నూనెరాసి హార్లిక్స్ యిచ్చాను' అంటూ మాలతి పిచ్చిదానిలా ఏదేదో మాట్లాడు తోంది. లలితకు భయంవేసింది. ఇన్నేళ్ళ నుంచి మాలతి తన గుండెల్లో దాచుకున్న కన్నీరంతా ఏమయింది?

'మీరు [illegible] ప్రాణాలు పోయాయి తల్లీ. అప్పటినుంచి
(తరువాయి పేజీ చూడండి)

ఆరోగ్య సౌభాగ్యములకు
మహిళలు ఆధారపడునవి
ఆరోగ్య అనారోగ్య పరిస్థితులలో

లోధ్ర

గర్భ పోషణకు, సుఖ ప్రసవమునకు

గర్భరక్షక

వేవిళ్ళకు, మలబద్ధకమునకు

మాదీఫల రసాయనం

ప్రసవానంతరం బలమునకు, క్షీరవృద్ధికి

సౌభాగ్య శొంఠి

68 సంవత్సరములకు పైగా
ప్రసిద్ధి పొందిన ఔషధములు.

కేసరి కుటీరం ప్రైవేట్ లిమిటెడ్
మదరాసు-14.

ఏజెంట్లు
సీతారామ జనరల్ స్టోర్సు (ఏజన్సీస్)
విజయవాడ.



బంగారు మాత్ర

సిద్ధ, ఆయుర్వేదములో బ్రహ్మాండమైన తయారు. ఇవి గోల్పోయిన శక్తి, ధాతు బలహీనత, పిండు బలహీనత, నరముల బలహీనతను పోగొట్టి మీకు కుటుంబసుఖం, జీవితసుఖం ఇచ్చేదానికి ఈ మాత్రకు ఏది సమం లేదు. చాలమంది నుండి బహుమతులు పొంది వున్నది. మీరు నేడే వాడండి. 100 మాత్రలు రు. 37-50. 50 మాత్రలు రు. 20/- పోస్టేజి రు. 3/- ముందుగా డబ్బు పంపవలెను. 50 మాత్రలకు తక్కువ పంపబడవు.

KARTHIKEYA VAIDYASALAI
PALANI P. O.
Madurai Dt. (Tamil Nadu)

# ఆహుతి

(34వ పేజీ తరువాయి)

ఈ అమ్మాయి ఏదేదో పలవరిస్తోంది. మాకు కంగారుగా వుందమ్మా' అంది అక్కడ నిలబడ్డ ఒకావిడ.

'దుఃఖం బయటికి రావాలి. ఇలానే వుందంటే మెదడుకు ఎఫెక్ట్ యిస్తుంది. ఆ అమ్మాయి ఏడిస్తే మంచిది' అంది మరో ఆవిడ.

గూట్లోవున్న జి. పుల్లారెడ్డి స్వీట్స్ ప్యాకెట్ తెరిచి 'తీసుకో జానకి. నిన్ననే మా మ్యారేజి యానివర్సరీ' అంది మాలతి.

గుడ్ల నీరు కుక్కుకుంటూ 'వొద్దు' అంది జానకి.

'ఈ ఒక్క బర్ఫీ తీసుకో. ప్లీస్' అంది మాలతి బ్రతిమాలుతూ.

'మాలతీ!' అంటూ జానకీ మాలతిని గట్టిగా హృదయానికి హత్తుకుని వుద్వేగంతో వెక్కి వెక్కి ఏడ్చింది.

'ఏయ్ పిచ్చిదానా! ఎందుకలా ఏడుస్తావ్? ఎవరు చచ్చిపోయారని? వూరుకో' అంది మాలతి. మాలతికళ్ళలో, మొహంలో, చేతుల్లో ఎలాంటిభావం అంతు చిక్కడం లేదు. ఆఫీసు సంగతులు, బొంబాయి సంగతులు, తను చదివిన సీరియల్ నవలగురించి యింకా ఏవేవో విషయాలు చెపుతున్న మాలతిని చూస్తుంటే వాళ్లకు కాళ్ళు చేతులు ఆడలేదు.

ప్రక్కగదిలో భర్త శవం!

ఈ గదిలో మాలతి ఏవేవో కబుర్లు చెబుతోంది. లోపల మంచుపర్వతాలు పెట్టుకుని, అరగంటసేపు బ్రతిమాలాక వాళ్ళనాన్న అడ్రసుతో పాటు నగరంలోనే వుంటున్న మరో యిద్దరు ముగ్గురు బంధువుల అడ్రసులు యిచ్చింది. ప్రకాశం జిల్లాలోని, మాలతి తండ్రికి టెలిగ్రాంలు పంపారు. గంటలో చిక్కడ్‌పల్లి, అమీర్‌పేటలో వున్న బంధువులు వచ్చారు. మాలతి యింకా ఏవేవో సంగతులు మాట్లాడుతూనే వుంది. మధ్య మధ్య 'ఆయన్ని డిస్టర్బ్ చెయ్యకండి. ఇప్పుడే పడుకున్నారు' అంటోంది. సాయంత్రం నాలుగున్నరకు ఆఫీసులో పనిచేసే తోటి వుద్యోగస్తులు చాలామందివచ్చి పరామర్శించారు.

'మిస్టర్ శేఖరంగారు, దయచేసి మీరు డాక్టర్ మాధవరావుగారిని రమ్మనండి. ఆయన ఏదయినా యింజక్షన్‌యిస్తే మాలతి రెండు మూడుగంటలు నిద్రపోతుంది ఈ కండిషన్‌లో ఆమె ఎక్కువసేపు వుండడం మంచిదికాదు' అని చెప్పింది జానకి.

బయటవున్న యిరానీ హోటల్నుంచి డాక్టర్‌కు ఫోన్‌చేసి, గార్డినాల్ టాబ్లెట్స్ రెండు కొనుక్కుని వచ్చి జానకికి యిచ్చి 'ఈ టాబ్లెట్స్ ఎలాగైనా ఆమెచేత మింగించండి. ఓ రెండుగంటలపాటు నిద్రపోతుంది' అన్నాడు శేఖరం.

జానకి గ్లూకోస్ నీళ్ళలో ఆ టాబ్లెట్స్ కలిపి మాలతికి యివ్వబోయింది.

'నాకెందుకు ఈ టాబ్లెట్స్?' అంది మాలతి.

'ఏ టాబ్లెట్స్?' అంది జానకి అమాయకంగా.

'నేను నిద్రపోవాలని యిందులో స్లీపింగ్ పిల్స్ కలిపారు. నాకొద్దు మీ పన్నాగం వుడకవు మనదగ్గర' అంది మాలతి.

ఎంతమంది ఎన్నివిధాల బ్రతిమాలినా, మాలతి ససేమిరా తీసుకోనంది. ఐదుగంటలకి డాక్టర్ మాధవరావువచ్చాడు. జేబులోంచి రెండు టాబ్లెట్స్ తీసి 'వేసుకోమ్మా, కళ్ళు మూసుకుని' అన్నాడు.

'వద్దండీ. మరేదన్నా మందు యివ్వండి, మావారి దగ్గరికి పోవడానికి' అంది నవ్వుతున్నట్టు.

'ఇది అదే, తీసుకోమ్మా' అని రెండు టాబ్లెట్స్ మాలతిచేత మింగించాడు.

అంతవరకు నిద్ర పోతున్న బాబు లేచాడు.

'బాబూ యిలా రారా. చూడు మనింటికి ఎంతమంది చుట్టాలొచ్చారో!' అంది మాలతి.

ఐదున్నరకి డాక్టరుతోపాటు అందరూ వెళ్ళిపోగా, లలిత, జానకి మాలతి వాళ్ళాకు నలుగురు బంధువులు మిగిలారు.

'ఈ రాత్రికి మీరిద్దరూ ఇక్కడే ఉండండమ్మా. మీరు ప్రక్కన వుంటే అమ్మాయికి కాస్త ధైర్యంగా వుంటుంది' అన్నాడు ఒక పెద్దాయన.

సరే నన్నారు వాళ్ళిద్దరూ. ఇళ్ళకి టెలిఫోన్ చేసి సంగతంతా చెప్పారు.

'వారికి కొంచెం కాఫీ పట్టాలి. తర్వాత హార్లిక్స్ ఇవ్వాలి' అంటూ లేచింది మాలతి.

'మేం చూస్తాంలే. నువ్వు కొంచెం రెస్ట్

తీసుకో.'

'భలే చుట్టాలేనే! చుట్టాలి కెవరన్నా వన్ను చెప్తారా? వద్దమ్మా! నేనే మాస్తాను' అంది మాలతి. బలవంతాన మాలతిని ఆప డానికి చాలా కష్టమయింది.

'జానకీ! మా బాబుకూడా నీలా ఎర్రగా అందంగా వున్నాడు. వాడిని నీకు యిస్తాను పెంచుకోరాదూ?' అంది మాలతి జానకి చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుంటూ.

'అలాగేలే. నువ్వు కాసేపు పడుకో.'

రాత్రి ఎనిమిదయింది.

వాళ్ళిద్దరి మధ్య మాలతి పడుకునివుంది కళ్ళు మూసుకుని.

కొన వూపిరితో కొట్టుకొంటున్న రోగి గుండెలా టేబిల్ మీది కింబిల్ సన్నగా కొట్టుకుంటోంది.

జానకి, లలితలకు కునుకు పట్టింది.

బాబు మంచం మీద తనకేమీ పట్ట నట్టు నిశ్చింతగా నోట్లో వేలు పెట్టుకుని నిద్రపోతున్నాడు.

వాళ్ళకు కొద్ది దూరంలో మాలతి బంధువులు పడుకుని నిద్రపోతున్నారు.

ప్రక్క గదిలో నిశ్శబ్దపు తెరలమాటున మృతదేహం తెల్లవారడంకోసం నిరీక్షి స్తోంది.

అటునుండి యిటు పొర్లిన మాలతికి రేడియం డయల్లో తళుక్కున తొమ్మిదిన్నర కనపడింది. ఒకసారి తన వక్కన వున్న వాళ్ళిద్దర్నీ చూసి నిశ్శబ్దంగా లేచి, తలు పులు నెట్టుకుని భర్తవున్న గదిలోకి వెళ్ళి రెండు నిమిషాల్లో తిరిగి వచ్చింది.

అప్పుడే కళ్ళు తెరిచిన జానకి 'ఏం కావాలి?' అంది.

'అబ్బె ఏం లేదు. బాత్‌రూంకు వెళ్ళి వస్తాను' అంది మాలతి.

'సరే. తోడు రానా?'

'అక్కర్లేదు' అంటూ మాలతి ఆ గది లోంచి బయటికెళ్ళింది.

ఐదు...ఏది ... పదిహేను నిమిషాలు... గడిచిపోయాయి. ఏదో గ్లాసు చప్పుడయి నట్టు వినిపించి జానకి వంటింట్లోకి వెళ్ళింది. నేలమీాద మాలతి పడివుంది! ప్రక్కన ఖాళీ గార్డినాల్ స్లీపింగ్ పిల్స్ బాటిల్!! ఏం జరిగిందో తెలిసిపోయిన జానకి బిగ్గరగా కేకవేసింది. అందరూ లేచారు. రెండు మూడు సందులు గొందులు తర్వాత వున్న డాక్టర్ని వెతికి పిల్చుకొచ్చే సరికి అరగంట పైనే అయింది.

'పిల్స్ లోపలికి పోయాయి. వెంటనే వుస్మానియా హాస్పిటల్‌కి తీసుకెళ్ళండి' అన్నాడు ఆ డాక్టర్. టాక్సీలో వుస్మానియా హాస్పిటల్‌కు వెళ్ళేసరికి రాత్రి పదకొం డయింది.

*　　　*　　　*

తెల్లారింది — గురువారం — వుదయం తొమ్మిది.

హాస్పిటల్‌లో మాలతిబెడ్‌చుట్టూ చాలామంది గుమిగూడివున్నారు. అందులో మాలతి తలిదండ్రులు కూడా వున్నారు. వొంట్లోకి గ్లూకోస్, ముక్కుల్లోకి ఆక్సి జన్ ఎక్కిస్తున్నారు. అపస్మారకంగా పడి వుంది మాలతి. అందరి గుండెలు బరువుగా వున్నాయి. అందరి చూపుల్లో ఆందోళన చోటు చేసుకునివుంది.

'సెర్పెక్సా?' అడిగాడు డాక్టర్.

'కాదు గార్డినాల్'

'ఎన్ని మింగింది?'

'చూళ్ళేదు.'

'అసలామెకు ఆ పిల్స్ ఎలా దొరికాయి?'

''ఆ అబ్బాయికి ఈ అమ్మాయే యింజె క్షన్‌లు, మందులు యిచ్చేదండీ! రాత్రులు అతను విపరీతమయిన బాధతో, దగ్గుతో మెలికలు తిరిగిపోతూ వుండేవాడు. అతని బాధచూసి ఈమె ఏడ్చేది. అతను మందులు తీసుకోడు. అందుకని అతనికి తాత్కాలి కంగా బాధపోయి నిద్ర పట్టడానికి స్లీపింగ్ పిల్స్ యిస్తుండేది. వాళ్ళింట్లో చాలా రకా లయిన మందులూ యింజక్షన్సూ వున్నా యండీ. ఆ అమ్మాయికి మందుల సంగతి బాగా తెలుసండీ! ఒక్కోరాత్రి రాత్రంతా అతని మంచందగ్గరే కూర్చునేది. తన కష్టం ఎవరికీ చెప్పకుని ఎరగదు మహా యిల్లాలు. ఒంటరితనం...బాధ...అలసట... నిద్రపట్టక తను కూడా అప్పుడప్పుడు నిద్ర మాత్రలువేసుకోవడం అలవాటు చేసుకుంది' అని ప్రక్కింటావిడ చెపుతుంటే వాళ్లం దరూ నోళ్ళు తెరిచి విన్నారు. మాలతి యింతకాలం తనకు చెప్పకుండా దాచి పెట్టిన విషయాలన్నీ ఒక్కొక్కటే బయ పడడంవల్ల జానకి దుఃఖం కట్టలు తెంచు కుని బయటపడాలని ప్రయత్నించ సాగింది. మాలతంటే సానుభూతి, జాలి రెట్టిం పయ్యాయి లలిత హృదయంలో.

ఇందువల్లనా మాలతి ఆఫీసులో పర ధ్యాన్నంగా వుండేది?

మధ్యాహ్నం ఒంటిగంటకు ఢిల్లీ ప్లేన్‌లో ప్రకాశం తల్లి, చెల్లెలు వచ్చారు. రెండు గంటలకు మాలతి యింకా అపస్మారకంలో వుండగా ప్రకాశం దహనకాండ జరిగి పోయింది. కళ్ళు తెరిచాక ఈ సంగతి తెలిస్తే మాలతి ఏమనుకుంటుందో?

మైలస్నానాలు ముగించుకుని అందరూ ఆస్పత్రికి వెళ్ళారు.

'స్పృహ ఎప్పుడొస్తుంది డాక్టర్?'

'కనీసం పదిహేను పిల్సయినా తీసుకుని వుండాలి. లేటయి పోవడంవల్ల రక్తంలో కలిసిపోయింది. బి. పి. చాలా వీక్‌గావుంది. చెప్పలేం. మరో మున్ఫై గంటలు పట్టొచ్చు' అన్నాడు డాక్టర్. కనీసం మాలతిదక్కితే బాగుండునన్న ఆతృత అందరి అంతరాత్మల్ని మూగగా దేవుని ప్రార్థింప చేసింది. మాలతి తండ్రిమొహం చూస్తుంటే వాళ్ళగుండెలు ఆవిసిపోయాయి.

ఆ రాత్రంతా మాలతి యింకా కళ్ళు తెరవలేదు.

డాక్టర్లంతా హడావిడిగా, ఆతృతగా, ఆందోళనగా ఆమె బెడ్ చుట్టూ చేరారు. ప్రతి పావుగంటకి పల్స్, బి.పి. చూస్తూనే వున్నారు.

రిపోర్టు షీట్‌లో పేజీలు నిండిపోతున్నాయే తప్ప మాలతి పరిస్థితిలో కొంచెం కూడా మార్పు రాలేదు.

'అలాంటి భర్తతో నేనైతే అసలు కాపరం చేసివుండేదాన్ని కాదు. ఎప్పుడో వదిలి పెట్టేదాన్ని' అంది మారియా లంచ్ రూములో. మారియా గోవనీస్. రిసెప్ష నిస్టుగా చేరి రెండు నెలలైంది.

'మా హిందువుల్లో స్త్రీ జీవితం—మాం గల్యం చుట్టూ తిరుగుతుంది. అది మీకు అర్థం కాదు. ఒకసారి ఒక వ్యక్తితో కలిసి ఏడడుగులు వేసి అగ్నిసాక్షిగా తాళి కట్టించు కొన్న తర్వాత ఆమెకు అతనే సర్వస్వం. అపూర్వమైన భార్యాభర్తల అనుబంధం మీరు వూహించుకోలేరు' అంది జానకి.

జానకి మాటలకి మారియా నవ్వి 'టు హెల్ విత్ యువర్ సెంటిమెంట్స్. ఒకరి

[illegible]

అంది తేలిగ్గా కొట్టేస్తూ.

గురువారం జరిగిపోయి శుక్రవారం వచ్చింది.

ప్రొద్దున బయలుదేరిన చిన్న ముల్లు తన ప్రయాణం ముగించింది ఆ రోజుకు. మాలతి ఇంకా అలానే వుంది. డక్టర్ల్లో కనిపిస్తున్న ఆత్రుత చూస్తుంటే వాళ్ళ గుండెల వేగం హెచ్చవేసినట్లుయింది. నిర్విరామంగా పోరాడసాగారు డాక్టర్లు మృత్యువుతో.

శనివారం— సాయంత్రం— నాలుగైంది.

మొహంలో ఆశ అంతరించసాగింది.

సరిగ్గా నాలుగున్నరకి మాలతిని మృత్యువు తన కౌగిట్లోకి లాక్కుంది.

ప్రకాశం చితి ఆరిపోయి ఇంకా డెబ్బయి రెండు గంటలు కూడా కాకుండా, దాని ప్రక్కన మరో చితి మండుతోంది. భయంకరంగా అగ్ని జ్వాలలు పడగలు విప్పిన పాముల్లా పైపైకి లేచి మాలతిని తమలో కలుపుకొంటున్నాయి.

చెమ్మగిలిన జానకి కళ్లకు ఆ మంటలు మసక మసగ్గా కనిపిస్తున్నాయి.

సెగంచచ్చిపోయి చావడానికి సిద్ధంగా ఉన్న ప్రకాశం పెళ్ళిచేసిన అతనితల్లిదండ్రులా?

చదువూ, సంస్కారం వుండీ, తను మహా భయంకరమైన క్షయ వ్యాధితో బాధ పడు తున్నానని తెలిసీ, అంతరాత్మను చంపుకుని మాలతి మెడలో తాళి అనే పేరుతో యమ పాశం కట్టిన ప్రకాశమా?

జానకి గుండెల్లో ప్రశ్నలు [illegible] వల్ల మెలికలు తిరుగుతున్నాయి.

చివరి ప్రశ్న చిరుగుల్లోనే జవాబు [illegible] వుందేమో!





(సుప్రీం కోర్టు తీర్పు ననుసరించి నడుపబడుతున్న సాహిత్య పోటీ) **సాహిత్య పోటీ నెం. 1**

ముగింపు తేది: 20—5—71. ఫలితాలు ప్రకటన: 26.5.71 ఆంధ్రపత్రిక, ఆంధ్రజ్యోతి డైలీలలో.

ప్రవేశ రుసుము:— ఒక కూపను రు. 1/—. 5 కూపనులకు రు. 4/—. 10 కూపనులకు రు. 7/—.

**ఆధారములు:**

1. మన తెలుగు కొంతకాలానికి హిందీ / ఉర్దూగా మారేట్లుంది.
2. కుక్కకి విశ్వాసం ఒక్కటేకాదు. కరిచే / కాచే గుణం కూడా వుంది.
3. విద్యలేనివాడెంత ద్రవ్యవంతు / ధనవంతుడైనను గౌరవింపబడడు.
4. ఈ ప్రపంచం చాలా పెద్దది / గొప్పది.
5. అర్హతలేని అదృష్టం / ఆడదానికోసం ఆశించి భంగపడ్డాను.
6. అయినదానికి విచారించిన కార్యము / ప్రయోజనము లేదు.
7. అంత సున్నితమైన / కఠినమైన మనస్సు మగవాడికి పనికిరాదు.
8. ఆత్మ శరీరానికి / యోగికి ఉత్తరంగా ప్రతియోగిగా ఉన్న వస్తువుకాదు.
9. వివాహము కాకపోయినను నతనికి / నామెకు సంసారి కంటె నెక్కువ తాపత్రయము కలదు.
10. "ప్రేమలేని వివాహం", "వివాహంలేని ప్రేమ" — [illegible] రెండవది / మొదటిది వ్యక్తిని బాధిస్తుంది.
11. ఈ సినిమా వో నాటకం / ప్రపంచం. ఇందులోనూ సంస్కారం, సంస్కృతి ఉన్నాయి.
12. దేశానికి ఇద్దరు / ముగ్గురు ప్రధాన మంత్రులు మారారు. అయినా జనం మారలేదు.
13. ప్రపంచంలోనున్న వస్తువులన్నిటిలో మనుష్యుడొకడే విజ్ఞానాన్ని / సంస్కృతిని ఆర్జించి, పెంపొందించి ఇతరులకు సంక్రమింపజేయగలడు

**నిబంధనలు:** (1) మీరు కరెక్టు అనుకున్న పదములు తెల్ల కాగితముపై వ్రాసి ఎంట్రీ రుసుము మనియార్డరు ద్వారాగాని, క్రాసుచేయని ఐ. పి. ఓ. ద్వారా గాని పంపవచ్చును. (2) ఎమ్. ఓ. రశీదులేని ఎంట్రీలు అంగీకరించబడవు. (3) రచయిత(త్రి) వాడిన పదమే సరియైనది. (4) ఒకరు ఎన్ని ఎంట్రీలైననూ పంపవచ్చును. ఎన్ని బహుమతులైననూ గెలవవచ్చును. (5) ఎంట్రీలలో తుడుపులు, కొట్టివేతలు వుండరాదు. (6) పదములు వ్రాసిన కాగితముపై మీ పూర్తి పేరు, అడ్రసు వ్రాయవలెను. (7) ముగింపు తేదీనాడు కూడా మీ ఎంట్రీలు 'ఎక్స్ప్రెస్ డెలివరీలో' పంపవచ్చును. (8) విజేతల లిస్టు, తరువాత ఎంట్రీ ఫారములకు మీ పూర్తి అడ్రసు గల పోస్టలు కవరు పంపవలెను. (9) మేనేజిమెంటువారిదే తుది నిర్ణయము. (10) లావాదేవీలు ప్రొద్దుటూరు కోర్టులో పరిష్కరించుకొనవలెను. (11) ఎట్టి ఆక్షేపణలున్న ఫలితములు ప్రకటించిన 10 రోజులలోగా రు. 10/— పంపుతూ ఆక్షేపణలు తెలుపవలెను. అవి సరికానిచో రు. 10/— కోల్పోవుదురు. (12) ఆల్ కరెక్టు విజేతల పోటీలతోపాటు వారికి యివ్వబడు పైకము గల చెక్కున్నూ ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక వీక్లీలలో ప్రచురించబడును. (13) మీ ఎంట్రీలు, మనియార్డర్లు యీ క్రింది అడ్రసుకు పంపండి.

నటరాజ ట్రేడింగ్ కార్పొరేషన్ (Regd.) ప్రొద్దుటూరు – కడప జిల్లా (A. P.)